www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 19 ఆగస్టు 2025

5


కాకినాడ



స్వచ్ఛ భారత్ స్టడీ టూర్‌కు పృథ్వీచరణ్

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 19 నుంచి 23 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎక్స్‌పోజర్ స్టడీ టూర్‌లో పాల్గొనడానికి కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ చరణ్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ స్టడీ టూర్‌లో తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు, సిబిజి ప్లాంట్లు, సి అండ్ డి వ్యర్థాల ప్లాంట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, ఈ-వేస్ట్, స్లాటర్ వ్యర్థాలు, కోడి వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలను పరిశీలిస్తామన్నారు.



పృథ్వీచరణ్

భారీ వర్షాలతో కడగండ్లు

- పంట నష్టాల పరిశీలన
- నష్టం పెరిగే అవకాశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఐదు రోజులుగా కురిసిన అకాల వర్షాలు వల్ల గొల్లప్రోలు మండలంలో గొల్లప్రోలు, చేబ్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, చెందుర్తి గ్రామాల్లో వేసిన వరి, పత్తి పంటలలో వర్షం నీరు అధికంగా చేరింది. పంట నష్టం పరిశీలించేందుకు పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్ దయాకర్, ఎం.రామ్ భద్రరాజు, ఐ.సుధీర్ కుమార్ సోమవారం గొల్లప్రోలు, చేబ్రోలు గ్రామాల్లో పరిశీలించారు. మూడు రోజుల క్రితం పరిశీలనలో వరి 1,625 ఎకరాల్లో, పత్తి 225 ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. సోమవారం సుద్దగడ్డ, చవటకాలువ వరద నీరు ఉధతి ఎక్కువగా ఉండడం వల్ల పంట నష్టం ఇంకా పెరగవచ్చని తెలిపారు. వరద నీరు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతులు చేపట్టాల్సిన సూచనలను శాస్త్రవేత్తలు తెలిపారు. వరద నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 20 కేజీలు యూరియా, 20 కేజీల పొటాష్ ఎరువులు, వర్షం తగ్గిన తర్వాత కార్బన్‌డిజం 1 గ్రామ్ ఒక లీటర్ నీటికి లేదా హెక్సాకోనజోల్ 2 మిల్లీమీటర్లు ఒక నీటి కలిపి ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఈ పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి కెవివి సత్యనారాయణ, గ్రామ విస్తరణాధికారి సంధ్య, రైతులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో చెరువును తలపిస్తున్న చేలు

భారీ వర్షాల కారణంగా జగనన్న కాలనీ వరదలో చిక్కుకుంది. సోమవారం కురిసన వర్షంతో సుద్దగడ్డ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సోమవారం జగనన్న కాలనీకి చెందిన ముగ్గురు గర్భిణులు డెలివరీ సమయం కావడంతో తహశీల్దారు గోపాలకృష్ణ, కమిషనర్ కనకారావు, ఐసిడిఎస్ సిడిపిఒ దుర్గాదేవి పోలీస్, మత్స్య శాఖ ఆధ్వర్యంలో సుద్దగడ్డ వాగు దాటించడానికి పడవను ఏర్పాటు చేశారు. అనంతరం వారిని వారి బంధువుల ఇళ్లకు తరలించారు పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ జగనన్న కాలనీ వద్ద సిబ్బందితో వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఆర్‌డిఒ మల్లిబాబు, నగర పంచాయతీ కమిషనర్ ఎన్.కనకారావు సహాయక చర్యలను పర్యవేక్షించారు.



గొల్లప్రోలు పట్టణంలో నీట మునిగిన వరి నాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి కాజులూరు

లోతట్టు ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ సూచించారు. సోమవారం మండలంలోని బంధనపూడి, మొగలిపాలెం, కోలంక, దుగ్గుదుర్రులో వ్యవసాయ అధికారి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నీటి ముంపునకు వరిలో తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలని, నారుమడి లేక వెదజల్లు పద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా మడిలోనుండి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరగట్టాలని, నారుమడి పూర్తిగా దెబ్బతింటే అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలతో మరలా విత్తుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు అనివిళ్ళ ప్రకాష్, దుర్గాప్రసాద్, కిషోర్ నాయుడు, అనిత, సాయిప్రసన్న రైతులు రైతులు పాల్గొన్నారు.



కాకినాడ దుమ్ములపేటలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

కాకినాడ సిపిఎం బృందం పర్యటన

కాకినాడలో.. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపు పరిస్థితిని తెలుసుకోవడానికి సిపిఎం బృందం కాకినాడ నగరంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలకా వెంకట రమణ, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ దుమ్ములపేటలో మెయిన్ డ్రైన్ పరిశీలించగా పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి, విపరీతంగా పూడికతో డ్రైన్ నిండిపోయి ఉందన్నారు. ప్రవహించే మురికినీరు నుంచి చెత్తను వేరు చేయడానికి ఆ ప్రాంతంలో నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన యంత్రం గత చాలా కాలంగా పనిచేయడం లేదన్నారు. అధికారులు నగరంలో శివారు ప్రాంతాల్లోనూ శానిటేషన్ పర్యవేక్షించాలని మే, జూన్ మాసాలలో పూడికలు తీయించాలని గతంలోనే కోరామన్నారు. పెరిగిన పనిభారానికి అనుగుణంగా సిబ్బందిని కూడా పెంచాల్సి ఉందన్నారు. గతం కంటే నగరంలో ముంపు సమస్య తగ్గడం అభినందనీయమన్నారు. మెయిన్ డ్రైన్స్ పూడికలు తీయించి, ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తే నగరంలో ముంపు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించే అవకాశం ఉందన్నారు.

తుపాను హెచ్చరికలతో నిలిచిన బోట్లు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

తుపాను హెచ్చరికలతో మత్స్యకారులు బోట్లు తీరానికి చేర్చి లంగర్లు వేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మత్స్యకారులు మూడు రోజులపాటు సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్ళద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో అమీనాబాద్ సమీపం వద్ద ఉన్న ఉప్పుటేరు వద్ద చేపల వేట నిలుపుదల చేసి బోట్లు లంగర్లు వేశారు. ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు రెండు నెలల పాటు చేపల గుడ్డు పెట్టే సమయంలో ప్రభుత్వం వేటను నిషేధిస్తారు. ఆ సమయంలో చేసిన అప్పులే మత్స్యకారులు తీర్చలేక ఆకలి కేకలు పెడుతున్న తరుణంలో వారి జీవనం ఆధారంపై వాయుగుండం రూపంలో గుదిబండ పడినట్టు అయిందని మత్స్యకారులు వాపోయారు. మండలంలో ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట, కోనపాపపేట గ్రామాల్లో సుమారు 20 వేల మంది మత్స్యకారులకు సముద్ర చేపల వేటే జీవనాధారం. తుపాను సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తీర ప్రాంతంలో మెడికల్ క్యాంపులు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన ఉప్పాడ, మూలపేట, పొన్నాడ, కొత్తపట్నం, మాయాపట్నం, సూరాడపేటల్లో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు సౌజన్య, సుష్మ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. వాతావరణం కారణంగా అనారోగ్య పాలవుతున్న మత్స్యకారుల కోసం అవసరమైన మందులను అందుబాటులో ఉంచి తీర ప్రాంతం మత్స్యకారులకు అందజేస్తున్నారు. హెల్త్ ఆఫీసర్స్ కిషోర్, అనూష, విష్ణు, రాజు, ఆశ వర్కర్స్ ఆశాజ్యోతి పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో నిలిచిపోయిన బోట్లు

దెబ్బతిన్న గ్రామీణ రహదారులు

ప్రజాశక్తి- తాళ్లరేవు

వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముసిరేసింది. మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో విద్యార్థులకు ఊరట లభించింది. పోలేకుర్రు పంచాయతీ తోటపేట వెళ్లే రహదారి వర్షం వల్ల పూర్తిగా చిద్రమైంది. దీనివల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తాళ్లరేవులో దెబ్బ తిన్న రోడ్డు




వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిసి చైతన్య మురళి

జిల్లాలో 15 బార్‌లకు గెజిట్ నోటిఫికేషన్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025-2028కు జిల్లా పరిధిలో 15 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఉమ్మడి జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళి తెలిపారు. జనాభా ప్రాతిపదికన రూ.50 వేల లోపు జనాభా గల మున్సిపాలిటీలకు సంవత్సరానికి రు.35 లక్షలు, 50 వేల నుండి 5 లక్షలు లోపు జనాభా గల మున్సిపాలిటీ, కార్పొరేషన్‌కు సంవత్సరానికి రు.55 లక్షలు కిస్తీ సొమ్ముగా నిర్ణయించినట్టు తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 11 బార్లు, సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో 1 బార్, పెద్దాపురంలో 1, పిఠాపురంలో 1, తునిలో 1 బార్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తుతో పాటు అప్లికేషను ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10,000ను ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్ లైన్ విధానంలో చెల్లించి కాకినాడ జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఈ నెల 28న ఉదయం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ తీస్తారని, సెలక్షన్ వివరాలు వెల్లడిస్తారని తెలిపారు.

కార్టూ'నిజం'



జిజిహెచ్‌లో రెండు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన 'వైద్యం గగనమాయే' కథనానికి కాకినాడ జిజిహెచ్ అధికారులు స్పందించారు. ఆసుపత్రిలో ఒపి సేవలు సక్రమంగా అందకపోవడంతో మధ్యాహ్నం 12 తర్వాత ఒపి సేవలు బంద్ చేస్తున్నారనేది కథనం సారాంశం. ఈ నేపథ్యంలో దీనిపై ఆస్పత్రి సిఎస్ ఆర్ఎంఒ మెహర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఈ నెల 15న ఎస్ఆర్ఎంఎటి బ్లాక్ సమీపంలో ప్రసూతి, గైనకాలజీ రోగుల కోసం రెండు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సాధారణ ఒపి సేవలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉండగా అత్యవసర సేవలు మాత్రం 24 గంటలూ అందుబాటులో ఉంటున్నాయన్నారు. అన్ని వైద్య కళాశాలలూ, సంస్థలు తమ వద్దకు వచ్చే రోగులను ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడి ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అవలంబిస్తే రోగులు ఇంటి వద్ద ఒపి టికెట్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. త్వరలోనే ఈ పద్ధతి అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

నేడు డ్వాక్రా మహిళలకు రుణ మేళా

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని 23 గ్రామాలకు సంబంధించిన డ్వాక్రా గ్రూపులకు రుణాల పంపిణీ చేస్తామని ఎపిఎం సూర్యనారాయణ తెలిపారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ చినరాజప్ప పాల్గొంటారన్నారు. ఆయన రుణాలు పంపిణీ చేస్తారని తెలిపారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ సుబ్బరాజు

కేశవ స్వామి ఆలయ కమిటీ ప్రమాణం

ప్రజాశక్తి- తాళ్లరేవు

శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామి దేవస్థానం నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ అధ్యక్షులుగా గాదిరాజు సత్యనారాయణ రాజు, సభ్యులుగా చావలి రవికుమార్, పెండ్యాల వీర వెంకట సత్యనారాయణ, కోటిపల్లి రమణ, గుత్తుల కృష్ణమూర్తి, అద్దేపల్లి వెంకట సుధారత్నం, భూసారపు కనకమహాలక్ష్మి, వాతాడి భాగ్యలక్ష్మి, సబ్బతి బాబ్జి, ఐతే చిన్నారి, మట్ట సత్తిబాబుతో ఆలయ ఇఒ యర్రా వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎలఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి నూతన కమిటీకి స్థానిక నాయకులు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, తాళ్ళరేవు సొసైటీ చైర్మన్ విళ్ల వీర, నడింపల్లి వినోద్, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, టేకుమూడి లక్ష్మణరావు, వేగేశ్న భాస్కరరాజు, పొన్నమండ రామలక్ష్మి, వాద్రేవు వీరబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రోళ్ల చక్రవర్తి, జక్కల ప్రసాద్ బాబు, వాకపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

పి-4 కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పి-4 కార్యాలయాన్ని సోమవారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఆర్‌డిఒ కె.శ్రీరమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజన్-2047లో భాగంగా ఈ పి-4 నియోజకవర్గ స్థాయి కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యాలయం ద్వారా నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు, సదుపాయాలు, పరిపాలన అందుతాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, జి.వెంకటేశ్వరరావు, అనివిళ్ల శాస్త్రి, గోమాడ వీరబాబు, బేదంపూడి సత్తిబాబు, గోకాడ భార్గవ్, వంగలపూడి సతీష్, జల్లూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -కరప

కాకినాడ రూరల్ పరిధిలోని ఏడుగురు లబ్ధిదారులకు రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ సోమవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. రూ.3,84,948 సొమ్ములను సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులు దాసిరెడ్డి కుమారి, పిల్లి అంత్రయ్య, పసుపులేటి రామకృష్ణ, ఇంజరాపు చినలక్ష్మి, గరికిన సత్యవతి, గరికిన అమ్మోరియా, దెయ్యాల గీతా ప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పంతం నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు మురళి, పుల్లా శ్రీరాములు, రామకృష్ణ, కోటి బాబు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ నానాజీ



ఆందోళన చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

న్యాయం చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ఆ కుటుంబ సభ్యులు కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఆదివారం ప్రమాదంలో కారు ఢీకొని కొత్త కోరంగికి చెందిన నిమ్మతి ఏసు, పాత కోరంగికి చెందిన అరబరుకుల లక్ష్మి మరణించిన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో మరో మహిళ దడాల ధనలక్ష్మితో పాటు, కొందరు చిన్నారులకు గాయాయ్యాయి. ఈ నేపథ్యంలో స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆందోళనకారులు బైఠాయించారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, అదనపు పోలీస్ సిబ్బంది వచ్చి ఆందోళనకారులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

త్రికరణశుద్ధితో పని చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-జగ్గంపేట

తమ ప్రభుత్వం త్రికరణ శుద్ధితో పని చేస్తోందని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి పత్రిక, ఛానల్‌లో స్త్రీ శక్తి పథకం ఫ్లాప్ అని అసత్యపు రాతలు రాస్తున్నారన్నారు. పథకం ప్రారంభించి రెండు రోజుల మాత్రమే అయ్యిందని, లోటు పాట్లు ఉంటాయని వాటిని సరిదిద్దుతున్నామని తెలిపారు. మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోలకు 10 శాతం నష్టం జరుగుతుందని, వారికి కోసం సిఎం చంద్రబాబు మరో ఆలోచన చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని 2 వేల మంది ఆటోల వారిని తాత్కాలికంగా ఆదుకునేందుకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం ప్యాకెట్లు ఇస్తామని తెలిపారు. వారికి వచ్చే నష్టానికి ఫౌండేషన్ ద్వారా నవీన్ సాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టిడిపి నాయకులు జీను మణిబాబు ఉన్నారు.

కనీస వేతనాలు, చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిజిహెచ్‌లో సేవలందిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్‌కు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులను కోరారు. సోమవారం జిజిహెచ్ ప్రాంగణంలో కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ప్రతినిధులు హనుమంత రెడ్డి, కామేశ్వరరావుతో సిఐటియు నగర నాయకులు మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు, సిహెచ్.విజయ్ కుమార్ తదితరులు చర్చలు జరిపారు. సెక్యూరిటీ గార్డ్స్, సూపర్వైజర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఎంఒయులో పేర్కొన్న విధంగా కనీస వేతనాలు అమలు చేయాలని, వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, నాయకులు కోరారు. ఈ చర్చల్లో యూనియన్ నాయకులు జె.శేష, ఆర్.రమేష్, జె.లక్ష్మీప్రియ, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోగులకు చీరలు, పోషకాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం జంక్షన్‌లోని చేంజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 20 మంది వ్యాధిగ్రస్తులకు సోమవారం చీరలు, పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రభావతి, డిస్ట్రిక్ట్ వాకర్స్ క్లబ్ గవర్నర్ సిహెచ్.నాగేశ్వరరావు, రీజినల్ సెక్రటరీ శ్రీనివాస్, అన్నపూర్ణ క్లబ్ ప్రసిడెంట్ ప్రభ, డిస్ట్రిక్ట్ సెక్రటరీ గోపాలకృష్ణ, జానకి, జోనల్ చైర్‌పర్సన్ జల్లి సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చేంజెస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పుష్ప కుమారి, ప్రాజెక్ట్ మేనేజర్ పండా దుర్గ భవాని, అకౌంటెంట్ సూరాల శివ, పి.సునీత, గౌరి, నారాయుడు, నాగదుర్గ, ఇ.గాయత్రి, పి.సరోజ, సుశీల సిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ఆదిత్యలో యాంటీ ర్యాంగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఫార్మసీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహించినట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ల తయారీ పోటీలు, ఉపన్యాస పోటీలు, డాక్యుమెంటరీ అవగాహన వీడియోల ప్రదర్శన నిర్వహించారు. ర్యాగింగ్ వల్ల తీవ్ర పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ కో ఆర్డినేటర్ విన్నీ థెరిసా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న దళితులు

మిగులు భూములపై హక్కుల కోసం ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

కోటనందూరు మండలంలో 30 ఏళ్లుగా మిగుల భూములు సాగు చేసుకుంటున్న దళిత రైతులకే హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.జనార్ధన్, వాడబోయిన శివ, పైపా పరసయ్య, ముప్పుం నూకరాజు, ధారకొండ సింహాచలం, మాసా సన్యాసమ్మ పాల్గొన్నారు.

గుండె చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణానికి చెందిన దేవరపు సారథి రామ్ గుండె చికిత్స నిమిత్తం వారాహి యువత మొగలి శ్రీనివాస్ టీము, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కడారి తమ్మయ్య నాయుడు, వినుకొండ అమ్మాజీ, పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


అదుపు తప్పిన ఒఎన్‌జిసి ఆయిల్ ట్యాంకర్

అదుపు తప్పిన ఆయిల్ ట్యాంకర్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానం ఒఎన్‌జిసి అన్ లోడింగ్ పాయింట్‌కు వెళుతున్న ఒఎన్‌జిసి ఆయిల్ ట్యాంకర్ సోమవారం జల్లివారి పేట వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి జారింది. దీంతో రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఆయిల్ ట్యాంకర్ నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ట్యాంకర్ నిండా క్రూడ్ ఆయిల్, గ్యాస్ ఉండటంతో ప్రజల ఆందోళన చెందుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల శివారు పంట పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చొప్పెల్ల శివారు పొలాల్లో మందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై ఎపి గేమింగ్ యాక్ట్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

నకిలీ కరెన్సీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ప్రజాశక్తి -కొవ్వూరు

నకిలీ కరెన్సీ తయారీ కేసులో ముగ్గురు వ్యక్తులకు కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి జివిఎల్.సరస్వతి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. నకిలీ కరెన్సీ తయారీపై 2013లో రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులైన ఐ.పంగిడికి చెందిన చదలవాడ అనిల్ కుమార్, నర్సీపట్నంకు చెందిన తెమ్మంద్ర రంజిత్ సింగ్, ఏలూరుకు చెందిన ఎల్లంపల్లి శ్రీనివాసరావులపై నేరం రుజువు కావడతో న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు కాగా ముగ్గురు గతంలో మృతి చెందారు. అప్పటి ఎస్ఐ అర్జున్‌రాజు కేసు నమోదు చేయగా అనంతరం వచ్చిన ఎస్ఐ ఎం.జయబాబు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

కొట్లాట ఘటనలో పలువురిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - గోపాలపురం

కొట్లాట ఘటనలో ఇరువురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక బిసి కాలనీలో కృష్ణాష్టమి వేడుకల అనంతరం ఓ గ్రూపునకు చెందిన యువకులకు సంబంధించి వాట్సప్ గ్రూపులో వాయిస్ మెసేజ్‌ల రూపంలో గొడవ జరిగింది. మెసేజ్‌లు పెట్టిన యువకుడని అదే గ్రూపులోని కొందరు యువకులు టాక్సీ స్టాండ్ సమీపంలో ఉన్న చికెన్ షాప్‌లోకి తీసుకెళ్లి కొట్టారు. ఈ సమయంలో అదే షాపు ఎదురుగా మరొక షాపులో ఉన్న ఉప్పరగూడేనికి చెందిన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో వారు వాగ్వాదానికిదిగారు. అక్కడున్నవ ఆరు సర్ది చెప్పడంతో వెళ్లిపోయారు. అనంతరం ఆదివారం సాయంత్రం ట్యాక్సీ స్టాండ్ సమీపంలో ఇరుగ్రూపులు ఘర్షణకు దిగాయి. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీంతో ఇరు గ్రూపులకు చెందినవారు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దేవరపల్లి సిఐ నాగేశ్వర్‌నాయక్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్, సిఐ నాగేశ్వర్‌నాయక్ బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసులు నమోదు చేశారు. అలాగే జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన కొంతమంది యువకులపైనా కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆదివారం నుంచి గోపాలపురంలో 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు.

బైకు పైనుంచి పడి బాలునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గోపాలపురం

ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడడంతో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కోమటికుంట గ్రామానికి చెందిన దాసరి ధనుష్, దాసరి దయ అన్నదమ్ములు. హెయిర్ కటింగ్ నిమిత్తం తన బాబాయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వారు గోపాలపురం వెళ్లారు. గోపాలపురం దాటిన తరువాత వారి బైకు అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ధనుష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

అదనపు కట్నంపై కేసు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అతని కుటుంబ సభ్యులు చిత్రహింసలకు పాల్పడుతున్నట్టు సీతానగరం మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన తొర్లపాటి సంధ్యారాణి సోమవారం సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సంధ్యారాణి భర్త జువ్వల రాజకుమార్, అత్తమామలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

90 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇనగంటివారిపేట ఏటుగట్టు వద్ద సారాను తరలిస్తుండగా వీరెల్లి రాము అనే వ్యక్తిని అరెస్టు చేసి, మూడు సంచులలో 90 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుని కోర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

యానాం వార్తలు


పందిరి రాట వేస్తున్న కమిటీ సభ్యులు

చవితి వేడుకలకు పందిరి రాట ముహూర్తం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయం సెంటర్‌లో వరసిద్ధి వినాయక 17వ నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని పందిరి రాట ముహూర్తం సోమవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి కోన రామచంద్రరావు, చక్రవేణి దంపతులు పందిరిరాట వేశారు. ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

సుభాష్ చంద్రబోస్‌కి నివాళి

ప్రజాశక్తి - యానాం

విప్లవ వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్థంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీరోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ అడలరసన్, కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

డ్రెయినేజీ దుర్వాసనతో అవస్థలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక త్యాగరాయ వీధిలో ఉన్న డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, పూడిక తీయకపోవడంతో చెత్త చెదారంతో దుర్వాసన వెదజల్లుతుందని, ఆసుపత్రికి వచ్చేవారు కూడా ఆ దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఎంఎల్ఎ అశోక్ సంబంధిత అధికారులతో కలిసి ఆ డ్రైనేజీని పరిశీలించారు. పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మెట్టకూరు ఆది ఆంధ్ర పేటలో రామాలయం మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు.

అందుబాటులోకి ఆధార్ సేవలు

ప్రజాశక్తి - సీతానగరం

ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ఎంపిడిఒ భారతి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజల సౌలభ్యం కోసం, మంగళవారం నుంచి బొబ్బిలంక గ్రామ సచివాలయం-1లో ఆధార్ సేవలను ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. నూతన ఆధార్ నమోదు, అప్‌డేట్‌లు, మార్పులు, లేదా ఇతర సేవలు అవసరమైనప్పుడు వారు చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చేది. ఈ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ఈ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల సీతానగరం మండలంలో బొబ్బిల్లంక పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణ భారం తగ్గి, సమయం ఆదా అవుతుంది. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇకపై బొబ్బిలంక గ్రామ సచివాలయం 1లో ఐదు రోజుల పాటు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీనివాస్ సూచించారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని కోరారు. పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైతే తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలన్నారు. మండలంలో సహాయక చర్యల కోసం అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, ఏమైనా ఆపద సంభవిస్తే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆరుతడి సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని మల్లవరంలో సోమవారం వరిలో ఆరుతడి పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ వలి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధి విధానాలు, వాతావరణం లో వచ్చే మార్పులు గురించి చెప్పారు వరి పొలంలో ఆరుతడి అనేది చాలా మంచి పద్ధతన్నారు. దీని వల్ల నీటి, విద్యుత్ ఆదా అవుతుందన్నారు. తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. అగ్రికల్చర్ ఆఫీసర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు పొలంలో కొంత భాగంలోనైనా ప్రకృతి సాగు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, సిఆర్‌పిలు శ్రీనివాస్, పొలవేణి, రత్నకుమారి పాల్గొన్నారు.

మునికూడలిలో పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, బిజెపి ఇన్‌ఛార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బత్తుల వెంకట లక్ష్మి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్ధగా చదువుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంట సంరక్షణ చర్యలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వర్షాలతో నీట మునిగిన పంటను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటే పంటను కాపాడుకోవచ్చునని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలలో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో నీట ముంపునకు గురైందన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటియు 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటియు 1061, ఎంపియు 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయని అన్నారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగిన మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలన్నారు. నారుమడి లేదా ఎద పద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా మడిలో నుంచి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరబెట్టాలని అన్నారు. అనంతరం 5 సెంట్ల నారుమడికి 1.0 కిలోల యూరియా 1.0 కిలో పొటాష్ వేయాలన్నారు.


జగన్నాథంకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

'పాలకుర్తి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపిటిసి సభ్యునిగా పాలకుర్తి జగన్నాథం అందించిన సేవలు అభినందనీయమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మతి చెందిన జి.మేడపాడు మాజీ ఎంపిటిసి పాలకుర్తి జగన్నాథం కుటుంబాన్ని సోమవారం ఎంఎల్ఎ పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్నాథం చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు ముమ్మిడి శ్రీరాములు, సొసైటీ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవనారాయణ, టిడిపి జిల్లా నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థానిక సచివాలయాల నుంచి ఇప్పటి వరకు ఎటువంటి కుల ధ్రువీకరణ పత్రమూ స్వీకరించని వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు కుల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా సుమోటోగా సేకరించిన వివరాల ప్రకారం మండలంలో మొత్తం 16,455 మందికి కుల దవీకరణ పత్రం అవసరం ఉన్నట్లుగా గుర్తించామన్నారు. వీటి కోసం లబ్ధిదారులు ఆయా గ్రామాల్లో విఆర్‌ఒలను కలవాలన్నారు. ఆధార్ కార్డు, లేదా వారి కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని సూచించారు. సచివాలయాల నుంచి సిబ్బంది లబ్ధిదారులకు ఫోన్ చేస్తే, వారికి సహకరించి, వివరాలు తెలపాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

'తంటికొండ'కు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటికొండ దేవస్థాన అభివృద్ధికి నిధులు కేటాయించాలంటూ దేవస్థాన చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి, టిడిపి నాయకులు కలెక్టర్ పి.ప్రశాంతికి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర మాట్లాడుతూ పుష్కరాల నిధుల్లో ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ప్రాముఖ్యమైన తంటి కొండపై వెంకన్న ఆలయానికి నిధులు కేటాయించాలని కోరామన్నారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ హయాంలో గుడి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మలిరెడ్డి వెంకటశ్రీధర్(సిరి), కమిటీ సభ్యులు బొట్టా రామకృష్ణ, చింతల నాగు, చప్పిడి పెంటరాజు, ఆలయ అధికారులు చిన్న, ఆలయ పురోహితులు ఫణి, చిట్టిబాబు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ సత్యప్రసాద్‌కు నివాళి

ప్రజాశక్తి - సీతానగరం

ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్ట్ బండి సత్యప్రసాద్‌కు పలువురు నివాళి అర్పించారు. సత్యప్రసాద్ సంతాప సభను సోమవారం సీతానగరం బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గంలోని జర్నలిస్టులు, నాయకులు, అధికారులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అంకం శ్రీనివాస్, ఎంపిడిఒ భారతి, ఎపిఒ సత్యవతి, ఎస్ఐ డి.రామ్ కుమార్ మాట్లాడారు. సత్యప్రసాద్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐఎంఎల్ఎ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మాట్లాడుతూ సత్య ప్రసాద్ అందరితో ఎంతో మంచిగా వ్యవహరించి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ సంతాప సభలో ఏకుల జితేంద్ర, బత్తుల వీరభద్రరావు, నందమూరి చిట్టిస్వామి, సీతానగరం మండల స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఐ.పోలవరం పిఎసిఎస్ త్రీ మెన్ కమిటీ ఛైర్మన్‌గా కాకర్లపూడి సత్య వెంకట రాయపరాజు, డైరెక్టర్లుగా మద్దిరెడ్డి కుమార్, చోడిశెట్టి వీరబాబు ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రత్యేక అధికారి టి.ఫణిపేర్రాజు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి సమక్షంలో వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, నాయకులు సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, అశోక్, చిలువూరి సుబ్బరాజు, గుత్తుల సాయి, చిక్కాల శ్రీనివాస్, పెంటా రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళను రక్షించిన ట్రాఫిక్ పోలీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే గేట్ వద్ద సోమవారం ఆత్మహత్యకు యత్నించిన మహిళను ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి రక్షించారు. రైల్వే ట్రాక్‌పైకి పరుగులు తీసిన మహిళను గుర్తించి, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సిబ్బంది సన్యాసిరావు, ఈశ్వరరావు, రంగరావు వెంటనే స్పందించి మహిళను కాపాడారు. బాధితురాలిని స్థానిక జగ్గమ్మగారిపేటకు చెందిన పోలవరపు నూకరత్నంగా గుర్తించారు. ఆమె అత్తగారిల్లు తునిలో ఉన్నట్లు సమాచారం. భర్త, సవతి తల్లి నుంచి ఆదరణ లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళ ప్రాణాలను కాపాడిన ఎస్ఐ గరగారావు, ట్రాఫిక్ సిబ్బందిని పలువురు అభినందించారు. బాధితురాలి సమాచారం మేరకు సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులకు ఆమెను అప్పగించారు.



రెడ్‌క్రాస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

రెడ్ క్రాస్ సొసైటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కోర్టు కాంప్లెక్స్ సమీపంలో రూ.40 లక్షలతో నిర్మించిన రెడ్ క్రాస్ సొసైటీ నూతన భవనాన్ని సోమవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ భవనాన్ని హైదరాబాద్‌కు చెందిన కాజా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, రెడ్ క్రాస్ చైర్మన్ సిహెచ్.విజయ్ ప్రకాష్, సెక్రటరీ శివకుమార్, డోనర్ కాజా రాజేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఆర్.ప్రభాకర్‌రావు, పి.సీతాదేవి, షేక్ ముస్తఫా, కెఆర్‌కె.చౌదరి, బిక్కిన విశ్వేశ్వరరావు, కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


క్యాంటీన్‌లో అన్నదానం చేస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు టిడిపి మండల అధ్యక్షుడు వీరంరెడ్డి రామలింగేశ్వర స్వామి సాయం అందించగా ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, రాయి సాయి, చాగంటి సత్యనారాయణ, డేగల సత్తిబాబు, ఎస్‌వి.ప్రసాద్, మారిశెట్టి గంగ, పుర్రె వీరబాబు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో నేడు వేద సభ

ప్రజాశక్తి - సామర్లకోట

కుమార రామ భీమేశ్వరాలయంలో మంగళవారం వేద సభ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ బళ్ళ నీలకంఠం, వేద పరిషత్ నిర్వాహకులు గ్రంధి సత్య రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలా త్రిపుర సుందరి వేద పరిషత్ ఆధ్వర్యంలో 27వ వేద సభ పండిత సన్మాన కార్యక్రమాలను భీమేశ్వరాలయంలో ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వేద పండితులకు సత్కారం నిర్వహించనున్నట్టు తెలిపారు.

టిడిపిలో విశ్రాంత ఉద్యోగుల చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట

ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు సోమవారం టిడిపిలో చేరాఉరు. మామిడాడకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం పసగడుగుల బాబూరావు, గండేపల్లి మండలం జెడ్.రాగంపేటకు చెందిన రిటైర్డ్ ఎంఇఒ కంటే ఉదయ భాస్కర్ చౌదరి వారి అనుచరులతో టిడిపిలో చేరారు. వారికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోకి చంద్రబాబు పాలన విధానాన్ని సమర్థిస్తూ చేరిని వారికి స్వాగతం పలుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, బుర్రి సత్తిబాబు, తోలేటి సూర్యనారాయణ, కోన బాబూరావు, మంచాల మల్లేశ్వరరావు, చంద్రమౌళి వెంకట శాస్త్రి, గోన చక్రరావు పాల్గొన్నారు.